# ఢిల్లీ డబుల్ ధమాకా

వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలుపు

## సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై సునాయాస విజయం



5 వికెట్లు తీసిన మిచెల్ స్టార్క్



డుప్లెసిస్ 50 (27)

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):

**ఆతిథ్య జట్టుకు అనుకూలించే ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి రెండు మ్యాచ్‌లకు ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆదివారం మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో పటిష్ఠమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది.**

- ఐదు వికెట్లను పడగొట్టిన మిచెల్ స్టార్క్
- హాఫ్ సెంచరీతో మెరిసిన డుప్లిసెస్
- ఎస్ఆర్‌హెచ్ బ్యాట్స్‌మన్ అనికేత్ వర్మ ఒంటరి పోరు వృథా



అనికేత్ వర్మ 74 (41)

ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన బౌలర్ మిచెల్ స్టార్స్ నిప్పులు చెరిగే బంతులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ఈ క్రమంలో ఐదు వికెట్ల ఘనతను సాధించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు డుప్లెసిస్ వేగవంతమైన హాఫ్ సెంచరీ (50; 3 సిక్సర్లు, 3 బౌండరీలు), మెక్‌గుర్క్ (38; 4 ఫోర్లు, 2 సిక్సర్ల)తోపాటు అభిషేక్ పోరల్ (34 నాటౌట్; (2 ఫోర్లు, 2 సిక్సర్లు) జట్టుకు సునాయాస విజయాన్నందించారు. అయితే భారీ సిక్సర్లు, బౌండరీలతో స్టేడియం హోరెత్తుతుందని ఆశించిన ప్రేక్షకులకు ఆదివారం అసలైన ఐపీఎల్ మజా అందలేదు. అడపాదడపా కనువిందు చేసే షాట్స్ మినహా రెండు జట్ల ఇన్నింగ్స్‌లో భారీ సిక్సర్లు, బౌండరీల జోరు కనిపించలేదు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు, కేరంతల మధ్య బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో అనికేత్ వర్మ(74) క్రీజులో ఉన్నంత



సేపు ఐపీఎల్ మజాను ఆస్వాదించారు. అతడు అవుటైన తర్వాత స్టేడియం అంతా నిశ్శబ్దంగా మారిపోయింది. మూడు ఓవర్లలో 29 పరుగులకు మూడు వికెట్లు, పది ఓవర్లలో 105 పరుగులకు నాలుగు వికెట్లు, 16 ఓవర్లలో 149 పరుగులకు ఎనిమిది వికెట్లు, 18.4 ఓవర్లకు 163 పరుగులకు ఆలౌట్. .. ఇదీ టైటిల్ ఫేవరెట్‌లో ఒకటైన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ కొనసాగిన తీరు. సీజన్ ప్రారంభ మ్యాచ్‌లో జోరు చూపించిన ఈ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ పేలవమైన బ్యాటింగ్‌తో తక్కువ స్కోరుకే

... మిగతా 6వ పేజీలో



మ్యాచ్‌ను వీక్షిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి లోకేశ్, బీసీసీఐ చైర్మన్ జై షా



## స్వర్ణ కవచంతో కనకమ్మ

వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని స్వర్ణ కవచంతో అలంకరించారు. పంచాంగ శ్రవణం అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందించారు సహాయ కార్యనిర్వాహణ అధికారి తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు. - మహారాణిపేట

# పంచాయతీలకు ఊపిరి



- 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- ఖాతాల్లో జమచేసిన ప్రభుత్వం
- సాధారణ నిధుల ఖర్చుపై ఫ్రీజింగ్ ఇబ్బందుల తొలగింపు

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):

**వైసీపీ ప్రభుత్వంలో ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొన్న గ్రామ పంచాయతీలు కూటమి పాలనలో తేరుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సాధారణ నిధులు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాలకు జమకావడంతో సర్పంచులు ఊపిరిపీల్చుకుంటున్నారు.**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం విడుదలచేసే 15వ ఆర్థిక సంఘం నుంచి జిల్లాలోని 79 గ్రామ పంచాయతీలకు టైడ్ గ్రాంట్ రూ.2.26 కోట్లు, అన్‌టైడ్ గ్రాంట్ రూ. 1.51 కోట్లు వెరసి రూ.3.77 కోట్లు ఆయా పంచాయతీ ఖాతాల్లో జమయ్యాయి. సోమవారంతో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి మరో విడత కేంద్రం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది.

### వైసీపీ హయాంలో నరకం

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 మార్చిలో ఎన్నికలు జరిగిన తరువాత బాధ్యతలు స్వీకరించిన సర్పంచులకు సంబంధిత పంచాయతీ ఖాతాల నుంచి నిధులు డ్రాచేసే వెసులుబాటు తొలగించారు. అప్పట్లో 14వ ఆర్థిక సంఘం చివరి ఏడాది నిధులు, తరువాత మొదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదలచేసినా వాటిని


... మిగతా 6వ పేజీలో

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** రంజాన్ సందర్భంగా ఈనెల 31వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సెలవు దినం కావడంతో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండరని, ఫిర్యాదుదారులు ఈ విషయం గమనించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కమిషనర్ కార్యాలయంలో కార్యక్రమం రద్దు చేశామని సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీలోనూ కార్యక్రమం నిర్వహించడం లేదని అదనపు కమిషనర్ రమణమూర్తి తెలిపారు.

## సామాజిక పింఛన్ల పంపిణీ రేపు

**విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీని ఏప్రిల్ ఒకటోతేదీ మంగళవారం చేపట్టనున్నారు. ఇప్పటికే 1,59,903 మంది పింఛన్‌దారులకు రూ.69.79 కోట్లు విడుదలయ్యాయి. ఆది, సోమవారాలు సెలవు కావడంతో పింఛన్ సొమ్ము శనివారమే సచివాలయాల సిబ్బంది డ్రా చేశారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,457 మందికి రూ.11.11 కోట్లు, నగరంలో 1,33,446 మందికి రూ.58.67 కోట్లు విడుదల చేశారు.





సోమవారం రంజాన్ సందర్భంగా నగరంలోని మసీదులన్నీ విద్యుత్ దీప కాంతులతో ప్రకాశిస్తున్నాయి. ప్రత్యేక నమాజులు, ఇఫ్తార్ విందులకు ముస్లింలు ఏర్పాట్లుచేస్తున్నారు.





ఉగాది పర్వదినాన్ని జిల్లా వాసులు ఘనంగా జరుపుకున్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. - 6లో

## నగరంలో మంత్రి లోకేశ్

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):



పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేశ్‌కు సమస్యలు వివరిస్తున్న మహిళలు

రాష్ట్ర ఐటీ, మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేశ్ ఆదివారం మధ్యాహ్నం నగరానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయనకు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ, అనకాపల్లి పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, బుద్దా నాగజగదీశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి పీఎం.పాలెం క్రికెట్ స్టేడియంనకు చేరుకుని ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించారు. రాత్రి పార్టీ కార్యాలయంలో బసచేశారు. సోమవారం ఉదయం బీచ్‌రోడ్డులోని హోటల్ నోవాటెల్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం చేరుకుంటారు. అక్కడి లేపాక్షి కల్యాణమండపంలో ఎలమంచిలి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలోపాల్గొంటారు. 4.30 గంటలకు అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని రాత్రి 7.15 గంటలకు విజయవాడ వెళతారు.

## రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.82 లక్షలు

- ఉగాది రోజున కార్యాలయాల్లో సందడి

**విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం జిల్లాలో తొమ్మిది స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 47 రిజిస్ట్రేషన్లు జరిగాయి. రూ.82లక్షల ఆదాయం సమకూరింది. సూపర్‌బజార్ ఆవరణలో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రూ.40లక్షల ఆదాయం వచ్చింది. ఉగాది రోజున భూములు, ఇళ్ల కొనుగోలు చేయాలన్న సెంటిమెంట్‌తో రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. ఆర్థిక సంవత్సరం చివరిరోజు సోమవారం రంజాన్ అయినప్పటికీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.13 (సోమవారం సాయంత్రం)

# రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు

- ఇప్పటివరకూ రూ.478.63 కోట్లు వసూలు
- 2024-25 ఆర్థిక సంవత్సరం కంటే రూ.38 కోట్లు అధికం
- నేడు మరో రూ.15 కోట్లు వసూలయ్యే అవకాశం
- జీవీఎంసీ చరిత్రలో ఇదే అత్యధికం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లు రికార్డుస్థాయికి చేరాయి. గతంలో ఎన్నడూలేనంతగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.478.63 కోట్లు వసూలైంది. సోమవారం వరకు గడువుండడంతో మరో రూ.15 కోట్లు వసూలవుతుందని అంచనా వేస్తున్నారు. జీవీఎంసీ చరిత్రలో ఇదే అత్యధిక వసూలని రెవెన్యూశాఖ అధికారులు పేర్కొనడం విశేషం.

జీవీఎంసీకి ప్రధాన ఆర్థిక వనరు ఆస్తి, ఖాళీస్థలాల పన్నులు.



ఏయూ నుంచి వసూలు చేసిన రూ.7 కోట్ల పన్ను చెక్కును డీసీఆర్ శ్రీనివాస్‌కు అందిస్తున్న జోన్ 3 అధికారులు

ఈ ఆదాయంతోనే నగరంలో అభివృద్ధి పనులు చేపడుతుంటారు. నగర పరిధిలో 5,89,994 ప్రైవేటు అసెస్‌మెంట్లు, 39,391 వీఎల్‌టీ అసెస్‌మెంట్‌లు, 1,630 రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అసెస్‌మెంట్లు, 524 కేంద్రప్రభుత్వ సంస్థల అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో

... మిగతా 6వ పేజీలో

# దూర విద్యలో ఇష్టారాజ్యం

- ఏయూ పరిధిలో డిగ్రీ, పీజీ పరీక్షల నిర్వహణకు 35 కేంద్రాలు
- హాజరవుతున్న 9 వేల మంది విద్యార్థులు
- అనేక చోట్ల యథేచ్ఛగా మాస్ కాపీయింగ్
- భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు
- కాలేజీల మధ్య వివాదాలు.. ఫిర్యాదులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం పరిధిలోని పరీక్ష కేంద్రాల్లో ఇష్టానుసారం పరీక్షల నిర్వహణ జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఫిర్యాదులందినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దూర విద్య కేంద్రం ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఏటా రెండు రకాలుగా ప్రవేశాలు చేపడుతున్నారు. ఆయా కోర్సుల్లో చేరే విద్యార్థులకు శ్రీకాకుళం జిల్లా నుంచి అనం



తపురం జిల్లా వరకు అనేకచోట్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్ని కేంద్రాల నిర్వాహకులు అడ్డగోలు చర్యలకు పాల్పడుతున్నారన్న

... మిగతా 6వ పేజీలో

## పి-4తో పేదలకు మేలు

**డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు**



సింహాచలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉగాది పురస్కరించుకుని ప్రారంభించిన పి-4తో పేదలకు మేలు జరగడం తథ్యమని రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకుల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే పేదలకు మేలు చేయాలన్న తలంపుతో ప్రభు త్వం పి4 విధానాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు.

## త్వరలోనే నిర్వాసితుల సమస్యలు పరిష్కారం

**ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

సింహాచలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్వాసితుల సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన సింహగిరిపై విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణానికి ఇళ్లు, స్థలాలు ఇచ్చి ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు టీడీఆర్‌లు ఇచ్చే విషయమై ఏప్రిల్ 3న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. దేవాలయం అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్‌పై త్వరలోనే ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

## దూర విద్యలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

విమర్శలున్నాయి. విద్యార్థుల నుంచి భారీగా డబ్బు వసూలు చేసి మాస్ కాపీయింగ్ ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సబ్జెక్టు వారీగా ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని కాలేజీలపై ఫిర్యాదులున్నాయి. కేలండర్ ఇయర్ అడ్మిషన్స్‌లో భాగంగా వివిధ కోర్సుల్లో చేరిన 9వేల మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఏడో తేదీ వరకు సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. ఒక్కో కేంద్రానికి 40 నుంచి 80 మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు ఒక్కో కేంద్రానికి అబ్జర్వర్‌తోపాటు స్పెషల్ స్క్వాడ్‌ను నియమించారు. అబ్జర్వర్లను కేంద్రాల నిర్వాహకులు మేనేజ్ చేస్తుండడంతో తాజాగా వర్సిటీ అధికారులు స్పెషల్ స్క్వాడ్‌ను నియమించారు. అయితే, ఈ స్క్వాడ్ కళ్లను కప్పి కొన్నిచోట్ల మాస్ కాపీయింగ్ జరుగుతోందనే విమర్శలున్నాయి.

### సమయం మించినా..

పరీక్షలు ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించాలి. కొన్ని చోట్ల ఆరు దాటిన తరువాత కూడా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. విజయనగరం జిల్లాలోని ఒక కేంద్రంలో సాయంత్రం పరీక్షలు నిర్వహించినట్టు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వీటిపై దూర విద్యా కేంద్రం అధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేస్తున్నారు.

### ఈ కేంద్రాలపై ఆరోపణలు..

దూర విద్యా కేంద్రాలకు సంబంధించి గజపతినగరంలోని ఒక కాలేజీ, కొత్తవలసలోని రెండు కాలేజీలు, ఎస్.కోటలోని ఒక కాలేజీ, సబ్బవరం, తాడేపల్లి గూడెం, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాల్లోని కొన్ని పరీక్ష కేంద్రాలపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ఏయూ దూర విద్యా కేంద్రం కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. దీంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల విద్యార్థులు భిన్నమైన కోర్సులు పూర్తిచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో లోపాలపై ఏయూ దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ మోహన్‌ను వివరణ కోరగా పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి కేంద్రంలో అబ్జర్వర్ తోపాటు స్పెషల్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. ఆరోపణలు వచ్చిన కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.





అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



భక్తులను క్యూలో రావాలని చెబుతున్న కానిస్టేబుల్

# ముగిసిన నూకాలమ్మ ఉత్సవం

- చివరి రోజు అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు

భీమునిపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నాలుగు రోజులుగా జరుగుతున్న నూకాలమ్మ ఉత్సవాలు ఆదివారం ముగిసాయి. చివరి రోజు అమ్మవారి దర్శనానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ కొనసాగింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయానికి ఉత్తరం వైపు సాధారణ దర్శనం, రూ. 10, శీఘ్ర దర్శనంతో పాటు ఆలయానికి పడమర వైపు ఏర్పాటు చేసిన రూ. 25 విశిష్ట దర్శనం, రూ.100 ప్రత్యేక దర్శనం క్యూలైన్లు వంద మీటర్ల వరకు బారులు తీరాయి. దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన టెంట్లకు మించి భక్తులు తరలిరావడంతో కొంతమంది ఎండలో చంటి పిల్లలతో ఇబ్బందులు పడ్డారు.ముఖ్యంగా ఉత్సవ నిర్వాహణకు ఆర్థిక తోడ్పాటు అందించిన విరాళాల దాతలకు ప్రత్యేకంగా ఆలయానికి దక్షిణ భాగాన దర్శనాలకు ఏర్పాటు చేసిన క్యూలైను వద్ద సరైన సదుపాయాలు లేకపోవడంతో అష్టకష్టాలు పడ్డారు. అక్కడికి చేరడానికి ఎటువైపు నుంచి వెళ్లాలో చాలా మందికి తెలియలేదు. అలాగే, ప్రతిసారి ఆలయానికి వెనుక భాగంలో జోగిపళ్ల గుడిపై భాగానికి భక్తులు విసరడం ఆనవాయితీ. ఈసారి కూడా అక్కడ జోగిపళ్ల వ్యాపారులకు స్థలం కేటాయించినా భక్తులు ఆలయం వెనక్కి వెళ్లకుండా తాళ్లతో దారులు మూసివేశారు. అధికారులు ఆలయ పరిసరాల్లో చెత్త ఎత్తివేయడానికి సిబ్బందిని ఏర్పాటు చేయకపోడంతో ఎక్కడికక్కడ అపరిశుభ్రత నెలకొంది. మొత్తమ్మీద అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల కొన్నిచోట్ల భక్తులకు ఇబ్బందులు కలిగాయి.

### స్వచ్ఛంద సంస్థల సాయం

ఈవో మురళీమోహన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. గుడివీధిలో న్యాయవాది పట్నాల వాయునందనశర్మ దంపతులు, పురోహితులు సునరాపు కామేశ్వర మాధవశాస్త్రి దంపతులు, సబ్బవరపు నాయుడు దంపతులు పులిహోర అందించారు. మెహర్‌బాబా సేవా కేంద్రం మజ్జిగ పంపిణీ చేయగా ఆర్యవైశ్య ఆర్గనైజింగ్ కమిటీ మెయిన్ రోడ్‌లో పులిహోర అందించారు.

**పద్మనాభం :** పొట్నూరు గ్రామంలో నూకాలమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితుడు ఏవీఆర్‌ఎస్ శర్మ ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు జరిపారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఊరూవాడా ఘనంగా ఉగాది

కొమ్మాది/మధురవాడ : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కొమ్మాదిలోని అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో వేకువజామున తోమాలసేవ జరిపి, లక్ష్మీనారాయణులకు, వైశాఖేశ్వరస్వామికి వజ్రకవచధారణ చేసి, బంగారు పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. తరువాత వేద పండితులు పంచాంగశ్రవణం వినిపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చంద్రంపాలెం జాతర గుట్టపై వెలసిన దుర్గాలమ్మ ఆలయంలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు. మధురవాడలోని పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు నాయుడు, అధ్యక్షుడు సూర్యప్రకాశ్, పాల్గొన్నారు.

**తగరపువలస :** చిట్టివలస రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.

**పద్మనాభం :** మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పద్మనాభం, మద్ది, పొట్నూరు, రెడ్డిపల్లి, కృష్ణాపురం, పాండ్రంగి, రేవిడి, కోరాడ, బీఆర్ తాళ్లవలస, అయినాడ గ్రామాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కాగా పొట్నూరు ఉమానీలకంఠేశ్వర స్వామి, కోదండరామస్వామి ఆలయ అర్చకుడు ఏవీఆర్‌ఎస్ శర్మకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. ఈమేరకు విశాఖలో నిర్వహించిన



నీలాద్రిగుమ్మం వద్ద భక్తుల రద్దీ

కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంటు కమిషనరు అన్నపూర్ణ, ఆలయ ఈఓ నానాజీ బాబు ఆయన్ను ఘనంగా సత్కరించి, పురస్కారం అందించారు.ఆలయంలో ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో విశేషంగా కృషి చేసినందుకు శర్మ ఈ పురస్కారాన్ని పొందారు.

**సాగర్‌నగర్ :** సాగర్‌నగర్,రుషికొండ ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే వందలాది మంది శ్రీవారిని దర్శించుకున్నారు. సుప్రభాత సేవ అనంతరం ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం పంచాంగ శ్రవణం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సాగరేశ్వరాలయంలోనూ పూజలు చేసి, పంచాంగ శ్రవణం వినిపించారు. మొగధారమ్మ ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ఉయ్యాల సేవ జరిపారు.

**సింహాచలం :** ఉగాది పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి ఆశీస్సులు పొందేందుకు పలువురు రాజకీయ నాయకులు, అధికారులతో పాటు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



రుషికొండ టీటీడీ ఆలయంలో భక్తుల క్యూ

స్వామివారిని దర్శించుకున్న వారిలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, విప్ గణబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర ఎంఏయూడీ విభాగం ముఖ్య కార్యదర్శి కె. సురేష్‌కుమార్ ఉన్నారు. అలాగే ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒకేరీతిన తరలివచ్చారు. కాగా నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలకు అతి సామాన్యంగా ఉంటుందని వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరిగిన పంచాంగ పఠనంలో ఉప ప్రధానార్చకులు, అలంకారి కరి సీతారామాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు తరువాత పంచాంగ పఠనం చేశారు. ఈఏడాది స్వాతి నక్షత్రం పురస్కరించుకుని స్వామివారి ఆదాయం 11, వ్యయం 5గా ఉందని పండితులు చెప్పారు. అనంతరం ఈఓ, పలువుర్ని సత్క రించారు.

### నిరాశపరచిన సూర్య కిరణాలు

స్వామివారి అంతరాలయంలోకి ఏటా ఉగాది నాడు మాత్రమే ప్రవేశించు సూర్యకిరణాలు భక్తులను ఈసారి నిరాశపరచాయి. సూర్యాస్తమయం వేళకు వినువీధిలో మేఘమాలికలు ప్రత్యక్షం కావడంతో కిరణాలు ఆస్థాన మండపం దాటి లోనికి ప్రవేశించలేదు.

## ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఎండాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు ముబారక్ కాలనీలో ఉన్న మొహమ్మదీ మజీద్‌లో బొహ్రా ముస్లింలు రంజాన్ పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాలనీలో ఉన్న బొహ్రా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి, ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నగరంలోని ముస్లింలకు విభిన్నంగా ఒక రోజు ముందుగా బొహ్రా ముస్లింలు రంజాన్ జరుపుకోవడం ఆనవాయితీ. ఈమేరకు వారు మజీద్‌లో ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో ఆమిల్ సాహెబ్, ముఫాద్దాల్ జైన్‌ద్దీన్, ఎం.అభిజీర్, పాల్గొన్నారు.

## కొద్దిరోజుల్లో డీక్యూఎంఎస్ రిజిస్ట్రేషన్

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌ను కొద్దిరోజుల్లో నిర్వహించనున్నట్టు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతామన్నారు. దీనివల్ల కాలయాపన తగ్గడంతో పాటు పారదర్శకత పెరుగుతుంద న్నారు. అవకాశం ఉన్న రోజుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఈ విధానంలో ఉంటుందన్నారు. కక్షిదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

## అప్పన్న వార్షిక కల్యాణోత్సవాలకు శ్రీకారం

సింహాచలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలకు ఆదివారం పందిరిరాటతో శ్రీకారం చుట్టారు. ఏటా చైత్రమాస శుక్లపక్ష పాడ్యమి అనగా ఉగాది రోజున ఉడుపు రాట వేయడంతో కల్యాణోత్సవాలను ప్రారంభించడ ఆనవాయితీ. ఈమేరకు ఆదివారం మధ్యాహ్నం ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులో ప్రత్యేక వేదికపై నిలిపి స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు ఉపచారాలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈశాన్య దిక్కున ఏర్పాటు చేసిన రాటకు మహిళలు పసుపు రాసిన తరువాత అర్చకులు పూజలు చేశారు. మంగళవాయిద్యాల నడుమ ఈఓ సుబ్బారావు దంపతులు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పీవీ నరసింహంతో కలిసి పండితులు, భక్తుల సమక్షంలో పందిరి రాట వేశారు. తరువాత ప్రధాన రాజగోపురం వద్ద, కల్యాణ వేదిక నిర్మాణం జరిగే ప్రాంతం వద్ద మరో రెండు పందిరి రాటలు పాతారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా, ఈఓ సుబ్బారావు, తదితరులు

# పంచాయతీలకు ఊపిరి

... 5వ పేజీ తరువాయి

పంచాయతీలకు నేరుగా ఇవ్వకుండా ప్రభుత్వం మళ్లించింది. పంచాయతీలు విద్యుత్ బిల్లులు బకాయిల కింద కేంద్రం ఇచ్చే నిధులు జమచేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటికి ఏనాడూ లెక్కలు చెప్పలేదు. పంచాయతీల వారీగా విద్యుత్ బకాయిలు ఎంత? ఎంత చెల్లించారు? మిగిలిన బకాయి ఎంత అనేది గ్రామ సర్పంచులకు చెప్పకపోవడంతో టీడీపీ, వైసీపీ సర్పంచ్‌ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. చివరకు సాధారణ నిధులు ఖర్చుపై ఆంక్షలు విధించింది. దీంతో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టలేదు. సుమారు మూడేళ్లపాటు పంచాయతీలకు రావాల్సిన నిధులు కోసం సర్పంచ్‌లు పోరాటంచేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధుల పంపిణీ కోసం పీఎంఎఫ్‌ఎస్ ఖాతాలకు కొత్తగా పంచాయతీల వారీగా ప్రారంభించాల్సి వచ్చింది. అదే సమయంలో సాధారణ నిధుల ఖర్చుపై వైసీపీ ఆంక్షలు కొనసాగించింది.

### ముఖ్యమంత్రి జోక్యంతో...

ఇదిలావుండగా గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేకించి పంచాయతీల పాలనపై దృష్టిసారించారు. కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్రం విడుదల చేసే సాధారణ నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలకు జమచేయాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు 24 గంటల్లో బిల్లులు మంజూరవుతున్నాయి. సాధారణ నిధులతో చేపట్టే పనులకు రెండుమూడు రోజుల్లో బిల్లులు విడుదల కావడాన్ని సర్పంచులు స్వాగతిస్తున్నారు. మూడేళ్లకుపైగా అనేక ఇబ్బందులుపడ్డామని, ప్రస్తుతం గ్రామాల్లో పనులు చేపట్టడానికి అడ్డంకులు లేవని గంభీరం గ్రామ సర్పంచి వానపల్లి లక్ష్మి పేర్కొన్నారు. నిధుల విషయంలో గత ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేశామన్నారు. అయితే టైడ్ గ్రాంట్, అన్‌టైడ్ గ్రాంట్ నిధుల ఖర్చుపై ఉన్న ఆంక్షలు సడలించాలని కోరారు. పారిశుధ్యం, తాగునీటితో సమానంగా పనులు చేపట్టేందుకు నిధులు ఖర్చుచేసేలా మార్పులు చేయాలన్నారు. లేకపోతే గ్రామాల్లో పనులు చేపట్టడానికి అవరోధం ఎదురవుతుందన్నారు. కాగా గ్రామ పంచాయతీ తీర్మానాల మేరకు చేపట్టే పనులకు బిల్లుల మంజూరు చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సంరలో మరో విడత కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకావాల్సి ఉందన్నారు.

## కళారత్న.. ఉగాది పురస్కారాలు



చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న చలపతిరావు, సరస్వతి, రెడ్డి, విక్రమ గౌడ్, శిరేల సన్యాసిరావు (కుడి నుంచి ఎడమకు)

విజయవాడలో జరిగిన ఉగాది సంబరాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నగరానికి చెందిన పలువురు కళారత్న, ఇతర పురస్కారాలు అందుకున్నారు. పురస్కారాలు తీసుకున్న వారిలో సుంకరి చలపతిరావు, సరస్వతి విద్యార్థి, బీఎం రెడ్డి, విక్రమ గౌడ్, శిరేల సన్యాసిరావు, తదితరులు ఉన్నారు.

# సస్యశ్యామలం.. సుభిక్షం

- జిల్లాలో ఈఏడాది ఆర్థిక పురోగతి
- పంచాంగ శ్రవణంలో వేద పండితుల వెల్లడి
- పేదరికం లేని సమాజ స్థాపనకు ఉగాది నాంది కావాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ఘనంగా ఉగాది సంబరాలు




జీకే సుబ్రహ్మణ్యాన్ని సత్కరించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పేదలు, రైతులు, నిరుద్యోగులకు ఈ ఏడాది అంతా శుభమే జరుగుతుందని పంచాంగకర్తలు నరసింహమూర్తి,రంగానాథాచార్యులు, శేషాచార్యులు తెలిపారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.పంచాంగ పఠన వేదిక వద్ద ఉత్సవమూర్తులు, వివిధ ఆలయాల ప్రధాన అర్చకులు ఆశీనులు కాగా ముఖ్య అతిథులుగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ హాజరయ్యారు. తొలుత విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పండింతులు వేదపారాయణం చేయగా.. పంచాంగకర్తలు పానిహారం నరసింహమూర్తి, పానంగపల్లి రంగనాథాచార్యులు జి. శేషచార్యులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ప్రగతి దశ దిశలా మార్మోగుతుందన్నారు.స్టీల్‌ప్లాంట్ ప్రాధాన్యత పెరుగుతుందని, ప్రజల జీవనం ఆశించిన విధంగానే ఉంటుందని, ఆర్థిక ఫలాలు కలుగుతా యని చెప్పారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సత్సంకల్పంతో అందుబాటులోకి తీసుకొస్తున్న పీ 4 ద్వారా పేదరికం లేని సమాజ స్థాపన సాధ్యపడుతుందని, దానికి ఉగాది నాంది కానుందని తెలిపారు. ధనవంతులు పేదలకు చేయూతనివ్వడం..ఆర్థికంగా అండగా నిలవడమే పీ 4 విధానం ప్రధాన లక్ష్యమన్నారు. తరువాత వేద పండితులను, పంచాంగకర్తలకు కలెక్టర్, జేసీ, వీఎంఆర్డీఏ కమిషనర్ జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించి సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నృత్యగీతికలు, తెలుగు భాష ఔన్నత్యాన్ని, ఉగాది విశేషాలను వివరిస్తూ సాగిన కవి సమ్మేళనాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, పర్యాటక శాఖ ఆర్‌డీ జగదీశ్, పర్యాటక శాఖ అధికారి సుధాసాగర్, జూక్యూరేటర్ మంగమ్మ, భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ డబుల్ ధమాకా

... 5వ పేజీ తరువాయి

అలౌటైంది. సాధారణ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి వరుసగా రెండో విజయం సాధించింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి ఓవర్‌లోనే రనౌట్ అయ్యాడు. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు దిగిన ఇషాన్ కిషన్(2) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలబడలేదు. అతడి స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన లోకల్‌బాయ్ నితీష్‌కుమార్ రెడ్డి కేవలం రెండు బంతులను ఎదుర్కొని చెత్త షాట్‌తో పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరాడు. వ్యక్తిగత ఎనిమిది పరుగుల వద్ద అక్షర పటేల్ బౌలింగ్‌లో అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న అనికేత్ వర్మ ఆ తరువాత చెలరేగి స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. కేవలం 34 బంతుల్లో నాలుగు బౌండరీలు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ(50) పూర్తిచేసిన అనికేత్ వర్మకు క్లాసిన్ (32) తోడవడంతో ఎస్‌ఆర్‌హెచ్ శిబిరం ఊపిరిపీల్చుకుంది. జోరుమీదున్న అనికేత్ వర్మ (74) కులదీప్ యాదవ్ బౌలింగ్‌లో మెక్‌గుర్క్ పట్టిన అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. తర్వాత స్థానాలో దిగిన బ్యాట్స్‌మన్లను మిచెల్ స్టార్క్ వరుసగా పెవిలియన్ దారి పట్టించాడు. సాధారణ లక్ష్యాన్ని ఛేదించడంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్ మెక్‌గుర్క్ (38) సమయస్ఫూర్తితో ఆడగా, మరో ఓపెనర్ డుప్లెసిస్ సిక్సర్లు, బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించాడు.అర్ధ సెంచరీ చేసిన డుప్లెసిస్ అన్సారీ బౌలింగ్‌లో తొలి వికెట్‌గా అవుటవ్వగా తర్వాత స్థానంలో దిగిన అభిషేక్ పోరెల్ (34 నాటౌట్) ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లను చెండాడి స్కోరు బోర్డును పరిగెత్తించాడు. ఈ మ్యాచ్‌లో జట్టులో చేరిన కేఎల్ రాహుల్ (15) అన్సారీ బౌలింగ్‌లో మూడో వికెట్‌గా పెవిలియన్‌కు చేరగా, స్టబ్స్ మ్యాచ్‌ను ముగించాడు.

# రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

రూ.440 కోట్లు పన్ను వసూలైంది. కొన్ని అసెస్‌మెంట్‌లకు సంబంధించిన యజమానులు పన్నులు చెల్లించకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయింది.

### లక్ష్యం దిశగా పయనం

ఇదిలా ఉండగా 2024-25లో రూ.480 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యం మేరకు రెవెన్యూ విభాగం అధికారులు ప్రణాళికలు రచించి, అమలుచేశారు. దీంతో ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఒకరోజు గడువుండగా, ఆదివారం నాటికి రూ.478.63 కోట్లు వసూలైంది. అందులో రూ.412 కోట్లు పన్నులు, వీఎల్‌టీ ద్వారా రూ.66.63 కోట్లు వసూలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులు రాబట్టడంతోపాటు పెండింగ్ బకాయిలను వసూలుచేయడానికి రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని జోన్‌ల కమిషనర్లు, రెవెన్యూ అధికారులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. అసెస్‌మెంట్‌లను ఆస్తిపన్ను మాదిరిగా, ఖాళీస్థలాల అసెస్‌మెంట్‌లను వార్డు సచివాలయాల వారీగా మ్యాపింగ్ చేశారు. అడ్మిన్ కార్యదర్శులు ప్రతి అసెస్‌మెంట్‌కు వెళ్లి పన్ను చెల్లించేలా యజమానులతో చర్చలు జరిపి, బకాయిలను రాబట్టారు. అంతకుముందు వార్డుల వారీగా అసెస్‌మెంట్‌లు ఉండడంతో టాక్స్ కలెక్టర్లు అన్ని అసెస్‌మెంట్‌ల యజమానులను కలిసి చర్చించేందుకు అవకాశం ఉండేది కాదు. తాజాగా వార్డు సచివాలయం పరిధిలో అన్ని అసెస్‌మెంట్‌లను మ్యాపింగ్ చేయడంతో పన్ను చెల్లించాల్సినవారికి డిమాండ్ నోటీసులు ఇవ్వడం, స్పందించనివారికి జప్తునోటీసులు ఇవ్వడం సులభమైంది. జీవీఎంసీ పరిధిలో సుమారు 20వేల మందికి జప్తునోటీసులు ఇవ్వడంతో వారంతా బకాయిలను క్లియర్ చేసుకోవడం పన్ను వసూలు పెరగడానికి దోహదపడింది.

### కలెక్టర్ చొరవతో...

అలాగే జీవీఎంసీ కమిషనర్ పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉండడంతో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం కూడా పన్నులు వసూలు పెరుగుదలకు పరోక్షంగా కారణమైందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. కలెక్టర్ హోదాలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన పోర్టు, రైల్వేశాఖల ఉన్నతాధికారులతో నేరుగా ఆయన సమావేశమై ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలని కోరడంతో వారంతా కొంత కట్టేందుకు ముందుకువచ్చారని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోర్టు ట్రస్టు ఇటీవల రూ. 12 కోట్లు ఆస్తిపన్ను చెల్లించగా, రైల్వేశాఖ నుంచి కూడా సోమవారం రూ.ఆరు కోట్లు వచ్చే అవకాశం ఉందని వివరిస్తున్నారు. ఏయూ వీసీతో కూడా జిల్లా కలెక్టరు హరేంధిరప్రసాద్ చర్చలు జరపడంతో రూ. ఏడు కోట్లు పన్ను చెల్లించారని చెబుతున్నారు. ఇది పన్నుల వసూళ్ల పెరుగుదలకు కారణమైందంటున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ ప్రకటించడంతో చాలామంది ప్రైవేటు అసెస్‌మెంట్ దారులు బకాయిలను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. బకాయిలపై వడ్డీ మాఫీకి సోమవారం మాత్రమే గడువు ఉండడంతో మరింత మంది అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు రూ.15 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## అప్పన్న సేవలకు రూ. 6 లక్షల విరాళం

సింహాచలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఇద్దరు దాతలు ఆదివారం రూ. 6 లక్షల విరాళం అందించారు. చందనం సమర్పణకు నగరానికి చెందిన లక్ష్మీ నారాయణ దంపతులు రూ. లక్ష, బెంగళూరుకు చెందిన ఐకానిక నిర్మాణ కంపెనీ అధినేత కె.మురళీ నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 5 లక్షలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో అధికారులకు అందించారు. అలాగే ఏప్రిల్ 8న జరిగే స్వామివారి వార్షిక తిరుకల్యాణోత్సవంలో వినియోగించాలని కోరుతూ గాజువాకకు చెందిన గుంటపల్లి ప్రసాద్ అరకిలో మంచి ముత్యాలను కానుకగా సమర్పించారు.

## వెంకన్నకు మకర తోరణం బహూకరణ

భీమునిపట్నం (రూరల్), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తాటితూరులో కొలువైన వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయానికి స్థానిక శాలివాహన యువజన సేవా సంఘం సభ్యులు ఆదివారం మకర తోరణం బహూకరించారు. తొలుత మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో మకర తోరణాన్ని ఊరేగించారు.

# నగరంలో ఐపీఎల్ జోష్



మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఏసీఏ ప్రతినిధులు

పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 18.4 ఓవర్లకు 163 పరుగులు చేయగా, ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి, ఇక్కడ రెండో విజయాన్ని నమోదు చేసింది.



జాక్ ఫ్రేజర్, డుప్లెసిస్




యువతి ఆనందం



కేఎల్ రాహుల్



ప్రేక్షకులతో నిండిన స్టేడియం



మహ్మద్ షమీ



ఢిల్లీ జట్టు కెప్టెన్ అక్షర పటేల్



వికెట్ తీసిన ఆనందంలో ఢిల్లీ జట్టు ఆటగాళ్లు



వికెట్ తీసిన ఆనందంలో మిచెల్ స్టార్క్



క్లాసెన్ బ్యాటింగ్



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో స్టార్క్



క్యాచ్ పడుతున్న జాక్ ఫ్రేజర్



ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, హోం మంత్రి అనిత



బీఆర్‌టీఎస్ రోడ్డులో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

## చలివేంద్రాలు ప్రారంభం

వేపగుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్‌వీ పురం ఆళ్వార్స్ క్యాంపస్ యాజమాన్యం ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు గాను బీఆర్‌టీఎస్ రోడ్డులో మజ్జిగ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. దీనిని ప్రారంభించిన సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్ మాట్లాడుతూ విద్యా సంస్థలను ప్రారంభించి విద్యాభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి, దివంగత ఆళ్వార్ దాస్ స్ఫూర్తితో ఈ చలి వేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**అగనంపూడి:** ఇక్కడి సత్రం జంక్షన్‌లో మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని స్థానిక కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు అగనంపూడి ప్రాంతంలో సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కూటమి నాయకులు గవర సోమశేఖర్, కరణం సత్యారావు, గల్లా రాజు, కె.పైడిరాజు, జగదీశ్, బాలయోగి, నాగు, సంస్థ అధ్యక్షుడు చిత్రా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్** : జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 34, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 18, బంగాళదుంపలు 15, అరటికాయ (పె) 8, అల్లం (పాతది) 50, బరబాటి 30, ముల్లంగి 24, మునక్కాడలు (కిలో) 34, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 460 |
| విజయనగరం | 464 |
| శ్రీకాకుళం | 464 |

**చికెన్ ధరలు**

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 118 |
| లైవ్ ధర | 138 |
| విత్ స్కిన్ | 246 |
| స్కిన్‌లెస్ | 256 |

# ఘనంగా ఉగాది వేడుకలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు
అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వవసు నామ ఉగాది వేడుకలను ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కొన్నిచోట్ల పంచాగ శ్రవణం జరిగింది. ఇక్కడి బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, టీడీపీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రునాయక్, యేల్లేటి శ్రీనివాసరావు, డి.కనకరెడ్డి పాల్గొన్నారు. త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి పూజలు చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చందనభరితంగా భక్తులకు దర్శనమిచ్చిన పెందుర్తి వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరస్వామి, షీలనగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీవారు

**కూర్మన్నపాలెం:** ఉగాది సందర్భంగా 87వ వార్డు లక్ష్మీపురంలోని శ్రీదుర్గాలమ్మ, శ్రీనూకాలమ్మ, శ్రీపోలిపిల్లమ్మ అమ్మవార్లను దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రధాన అర్చకులు ఇరగవరపు వాసు, శ్రీధర్ స్వాముల ఆధ్వర్యంలో అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. కార్పొరేటర్ బొండా జగన్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే 87వ వార్డు పరిధిలోని వడ్లపూడి, కణితి, లక్ష్మీపురంలో గల శ్రీనూకాలమ్మ ఆలయాల్లో చేపట్టిన పూజల్లో బొండా జగన్‌తో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కణితి గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 87వ వార్డు కూర్మన్నపాలెంలోని సంపత్ వినాయక ఆలయంలో, శ్రీవేణుగోపాల స్వామి ఆలయం, సంతమామిడితోట శివాలయం, లక్ష్మీపురం కాలనీలోని వేంకటేశ్వరాలయం, 88వ వార్డు గ్రీన్ సిటీ శ్రీవారి ఆలయం, 71వ వార్డు శ్రీనగర్‌లోని శ్రీకృష్ణుడి ఆలయం, సంపత్ వినాయక ఆలయాల్లో జరిగిన పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్న సమారాధనలు చేపట్టారు.

**ఆటోనగర్:** గ్రేటర్ 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం డ్రైవర్స్ కాలనీలో గల శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో, చిట్టినాయుడు కాలనీలోని అమ్మవారి ఆలయంలో జరిగిన పూజల్లో టీడీపీ నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావులతో భక్తులు పాల్గొన్నారు. బాలత్రిపుర సుందరి అమృతలింగేశ్వరస్వామి, ఆటోనగర్ దుర్గామల్లికార్జునస్వామి ఆలయంలో, చట్టివానిపాలెం వైకుంఠ నారాయణ అవతార క్షేత్రంలో, ఎల్‌వీనగర్, ఎర్రగెడ్డ కాలనీల్లో గల లక్ష్మీగణపతి, శ్రీపైడితల్లి, నూకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు.

**అగనంపూడి:** ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా ఇన్‌చార్జి బీకే త్రివేణి హిందూ సంప్రదాయంలో శుభప్రదమైన పసుపును పంపిణీ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులకు భరతనాట్య శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీకే రామకోటి, రాజు, సత్యనారాయణ, నరసింహమూర్తి, బుజ్జి. తదితరులు పాల్గొన్నారు.

**పెదగంట్యాడ:** పెదగంట్యాడ టిడ్కో గృహ సముదాయాల వద్ద ఉగాది వేడుకలను సందడిగా జరిపారు. సీపీఐ గాజువాక నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని తయారుచేసి స్థానికులకు పంపిణీ చేశారు. టిడ్కో గృహ సముదాయాల్లో నెలకొన్న సమస్యలు విశ్వవసు నామ సంవత్సరంలో పరిష్కారం కావాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.సత్యనారాయణ, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, టిడ్కో గృహ లబ్ధిదారుల ప్రతినిధులు పి.అప్పలరాజు, రొక్కం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లిముక్కు రామాలయంలో పంచాంగ శ్రవణంతో పాటు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నెల్లిముక్కు పెంటమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పంచాంగ శ్రవణాన్ని చేపట్టారు.

**పెందుర్తి:** ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారిని 27 కిలోల చందనంతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు, విశేష అర్చన, అఖండ హారతులివ్వగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం పంచాంగ శ్రవణాన్ని చేపట్టడంతో పాటు భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అలాగే శారదా పీఠంలో ఉగాదిని పురస్కరించుకుని ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి భక్తులకు అనుగ్రహ భాషన చేశారు. అందర ధర్మ మార్గంలో పయనిస్తూ ధార్మిక భావంతో జీవనం సాగించాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఆచరించిన ధర్మాన్ని వీడరాదన్నారు. అనంతరం శ్రీవిశ్వవసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. పీఠం ఆస్థాన సిద్ధాంతి అభిశక్తిశర్మ పంచాంగ శ్రవణం చేశారు.తొలుత పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూపా రాజశ్యామల అమ్మవారికి పూజలు చేశారు.

**గోపాలపట్నం:** ఉగాది సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇక్కడి నూకాంబికను దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. కొత్తపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాన్ని చేపట్టడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధనలను చేపట్టారు.

**వేపగుంట:** నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. కృష్ణానగర్‌లోని గణపతి ఆలయంలో స్వామివారికి గరికతో ప్రత్యేక పూజలు జరిపారు. కృష్ణానగర్ గుడివీధిలోని దుర్గామల్లేశ్వరాలయంలో,వేపగుంట ముత్యమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**ఎన్.ఎ.డీ జంక్షన్:** గ్రేటర్ 90, 52వ వార్డుల్లోని శివాలయాలు, వేంకటేశ్వరాలయాలు, గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. ఎన్ఏడీలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరున్ని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

**అక్కిరెడ్డిపాలెం:** షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారిని చందనంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేయగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజామున స్వామివారిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించాక చందనంతో అలంకరించారు. సాయంత్రం అర్చకులు ప్రవీణ్‌కుమార్ పంచాంగ శ్రవణం చేశారు.



కొత్తపాలెం ప్రశాంతినగర్‌లో పుష్పాలతో అలంకరించిన సాయినాథుడు



87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో పూజలందుకున్న అమ్మవార్లు

## లో వోల్టేజీ సమస్యకు చెక్

రెండుచోట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

అగనంపూడి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌లో వోల్టేజీ సమస్యకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మరును ఏర్పాటు చేశారు. అగనంపూడి

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

ఈపీడీసీఎల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ కనెక్షన్లకు సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో నిత్యం ప్రజలు లో వోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న 'లోవోల్టేజీ సమస్యతో సతమతం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి ఇకపై లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మరును ఏర్పాటు చేశారు. సెక్షన్ కార్యాలయ పరిధిలో ఎక్కడా లో వోల్టేజీ సమస్య లేకుండా మంగళపాలెం, అగనంపూడి ప్రాంతంలో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్టు ఏఈ జయంత్ లక్ష్మణ్ తెలిపారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి, స్పందించి చర్యలు చేపట్టిన ఈపీడీసీఎల్ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



అగనంపూడి వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

## నేడు ఆస్తి పన్ను చెల్లించవచ్చు

గాజువాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు అయినప్పటికీ ఆస్తి పన్ను చెల్లించేందుకు కౌంటర్ తెరిచి ఉంటుందని జోనల్ కమిషనర్ శేషాద్రి తెలిపారు. 50 శాతం వడ్డీ మాఫీతో ఆస్తి పన్ను చెల్లించేందుకు సోమవారం తుది గడువుగా పేర్కొన్నారు. జోనల్ పరిధిలో గల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్రీడాకారులకు ఉజ్వల భవిత

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అన్నారు. ఇస్లాంపేటలో ఆదివారం క్రికెట్ క్లబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగడంతో పాటు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో ఎక్కువగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణారావు, ఆలం, శ్రీను, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న కంటెయినర్ ట్రాలర్

అక్కిరెడ్డిపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ వద్ద లారీని ఢీకొనడంతో ఓ కంటెయినర్ ట్రాలర్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో గాజువాక నుంచి పోర్టుకు వెళ్లేందుకు గంగవరం నుంచి వస్తున్న కంటెయినర్ ట్రాలర్ బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి రెడ్ లైట్ పడడంతో ఒక్కసారిగా ముందున్న వాహనాలు ఆగిపోయాయి. దీంతో ట్రాలర్ డ్రైవర్ తన ముందున్న లారీని బలంగా ఢీకొనగా, అది తన ముందున్న కారును ఢీకొంది. దీంతో ట్రాలర్ ముందు భాగంగా బాగా దెబ్బతినగా, లారీ, కారు వెనక భాగాలు కొంతమేర దెబ్బతిన్నాయి. అయితే ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంతో వాహనాల రాకపోకలకు కాసేపు అంతరాయం వాటిల్లింది. పోలీసులు క్రేన్ సహాయంతో ట్రాలర్‌ను పక్కకు తొలగించారు.



కంటెయినర్ ట్రాలర్‌ను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

## పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై షీలానగర్ వద్ద సర్వీస్ రోడ్డులో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జయింది. ఆదివారం సాయంత్రం మల్కాపురానికి చెందిన స్నేక్ క్యాచర్ నాగరాజు షీలానగర్‌లో గల డీమార్ట్‌కు వెళ్లేందుకు అక్కడ సర్వీస్ రోడ్డులో తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఆ సమయంలో నగరంలో నుంచి వచ్చిన లోడ్‌తో ఉన్న లారీ సర్వీస్ రోడ్డులో పార్కింగ్ చేసేందుకు యత్నిస్తూ పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు చక్రాల కిందకు ద్విచక్ర వాహనం వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. నాగరాజు ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోడిపందేలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ప్లాంట్ బీసీ గేటు సమీపంతో కోడిపందేలు ఆడుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.12,320 నగదును స్వాధీనం చేసుకున్నారు.

## విద్యార్థి దశ ఎంతో కీలకం

దాడి ఇంజనీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్



విద్యార్థులతో దాడి రత్నాకర్, తలశిల బలరామకృష్ణ, తదితరులు

ఆటోనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని దాడి ఇంజనీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. శ్రీనగర్ యాపిల్ స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా వేడుకలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. స్కూల్ చైర్మన్ తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను చిన్నారులకు అలవడేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. అనంతరం విద్యార్థులను ప్రమోట్ చేస్తూ పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు ఎస్.విష్ణువర్ధనరావు, జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ భారతి, సుభాషిణి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పెద్దింటమ్మ పరస

మల్కాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మల్కాపురంలో ఆదివారం పెద్దింటమ్మ పరసను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఏటా ఉగాది పర్వదినాన అమ్మవారి పరసను నిర్వహించడం జరుగుతుందని టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ తెలిపారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## స్టీల్ క్లబ్‌లో ఉగాది సంబరాలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉక్కు జీఎం చంద్రశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉగాది సంబరాలను జీఎం (టీఏ) వై.చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి పి.రామకృష్ణ, సభ్యులు వేణుగోపాల్, నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ మంచి జరగాలి: ఎంపీ శ్రీభరత్



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇతర నాయకులు

మహారాణిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండితులు నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. తెలుగు ప్రజలు అత్యంత ప్రీతిపాత్రంగా జరుపుకొనే ఉగాది పండగ సందర్భంగా ఈ సంవత్సరం అంతా మంచి జరగాలని కోరుకుంటారన్నారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ మాట్లడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఉగాది నుంచి ప్రజలు సుఖశాంతులతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, రాజమండ్రి నారాయణ, తమ్మిన విజయకుమార్, వానపల్లి ఫణిగాయత్రీ కుమారి, వెల్లంకి భరత్, తోట రత్నం, గనగళ సత్యవతి. సుజాత, రమాదేవి, విల్లూరి తిరుమలా దేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలకు శ్రీకారం



అంబికాబాగ్ ఆలయంలో పెండ్లిరాట వేస్తున్న అర్చకులు

మహారాణిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీ రామ నవమి ఉత్సవాలకు ఆదివారం శుభారంభం చేశారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా మహారాణిపేటలోని అంబికాబాగ్ శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 7 వరకు శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తారు. ఆలయంలో ఆదివారం దేవాలయంలో అధికారులు, వేదపండితులు, అర్చకులు సీతారాములు కల్యాణం పెండ్లి రాట వేశారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తిని పెండ్లి కొడుకును చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు.

## ఆకట్టుకున్న భక్తి గీతాలు



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

సీతంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శంకరమఠంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సంగీత కీర్తనలు, భక్తి గీతాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐవీల్ శాస్త్రి జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌కే ప్రసాద్, వి.వి.వి. శంకరం, వి.ప్రకాశరావు, ఆకొండి వెంకటరావు, ఎంపీ రాజశేఖర్, ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ప్రతినిధులు వెంకటరావు, కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్‌మోహన్‌రావు, వి.మధుసూదనరావు, మధుబాబు, ఎం.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరావు, అభిమానులు పాల్గొన్నారు.

## ఢిల్లీ డబుల్ ధమాకా

... 5వ పేజీ తరువాయి


ఆలౌటైంది. సాధారణ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు నష్టపోయి వరుసగా రెండో విజయం సాధించింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఓపెనర్ అభిషేక్ శర్మ తొలి ఓవర్‌లోనే రనౌట్ అయ్యాడు. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు దిగిన ఇషాన్ కిషన్(2) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలబడలేదు. అతడి స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన లోకల్‌బాయ్ నితీష్‌కుమార్ రెడ్డి కేవలం రెండు బంతులను ఎదుర్కొని చెత్త షాట్‌తో పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరాడు. వ్యక్తిగత ఎనిమిది పరుగుల వద్ద అక్షర పటేల్ బౌలింగ్‌లో అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న అనికేత్ వర్మ ఆ తరువాత చెలరేగి స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. కేవలం 34 బంతుల్లో నాలుగు బౌండరీలు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ(50) పూర్తిచేసిన అనికేత్‌వర్మకు క్లాసిన్ (32) తోడవడంతో ఎస్‌ఆర్‌హెచ్ శిబిరం ఊపిరిపీల్చుకుంది. జోరుమీదున్న అనికేత్ వర్మ(74) కులదీప్ యాదవ్ బౌలింగ్‌లో మెక్‌గుర్క్ పట్టిన అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. తర్వాత స్థానాలో దిగిన బ్యాట్స్‌మన్లను మిచెల్ స్టార్స్ వరుసగా పెవిలియన్ దారి పట్టించాడు.

సాధారణ లక్ష్యాన్ని ఛేదించడంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్ మెక్ గుర్క్ (38) సమయస్ఫూర్తితో ఆడగా, మరో ఓపెనర్ డుప్లెసిస్ సిక్సర్లు, బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించాడు. అర్ధ సెంచరీ చేసిన డుప్లెసిస్ అన్సారీ బౌలింగ్‌లో తొలి వికెట్‌గా అవుటవ్వగా తర్వాత స్థానంలో దిగిన అభిషేక్ పోరెల్ (34 నాటౌట్) ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లను చెండాడి స్కోరు బోర్డును పరిగెత్తించాడు. ఈ మ్యాచ్‌లో జట్టులో చేరిన కేఎల్ రాహుల్ (15) అన్సారీ బౌలింగ్‌లో మూడో వికెట్‌గా పెవిలియన్‌కు చేరగా, రాహుల్ స్థానంలో వచ్చిన స్టబ్స్ (21 నాటౌట్, 3 ఫోర్లతో) మ్యాచ్‌ను ముగించాడు.



# సస్యశ్యామలం.. సుభిక్షం

» జిల్లాలో ఈ ఏడాది ఆర్థిక పురోగతి » పంచాంగ శ్రవణంలో వేద పండితుల వెల్లడి » ఘనంగా ఉగాది సంబరాలు
» పేదరికం లేని సమాజ స్థాపనకు ఉగాది నాంది కావాలి » కలెక్టర్ హరేంధిర ప్రసాద్



జీకే సుబ్రహ్మణ్యాన్ని సత్కరించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పేదలు, రైతులు, నిరుద్యోగులకు ఈ ఏడాది అంతా శుభమే జరుగుతుందని పంచాంగకర్తలు నరసింహమూర్తి, రంగానాథాచార్యులు, శేషాచార్యులు తెలిపారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాంగ పఠన వేదిక వద్ద ఉత్సవమూర్తులు, వివిధ ఆలయాల ప్రధాన అర్చకులు ఆశీనులు కాగా ముఖ్య అతిథులుగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ హాజరయ్యారు. తొలుత విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పండింతులు వేదపారాయణం చేయగా.. పంచాంగకర్తలు పానిహారం నరసింహమూర్తి, పానంగపల్లి రంగనాథాచార్యులు జి. శేషాచార్యులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ప్రగతి దశ దిశలా మార్మోగుతుందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రాధాన్యత పెరుగుతుందని, ప్రజల జీవనం ఆశించిన విధంగానే ఉంటుందని, ఆర్థిక ఫలాలు కలుగుతాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సత్సంకల్పంతో అందుబాటులోకి తీసుకొస్తున్న పీ 4 ద్వారా పేదరికం లేని సమాజ స్థాపన సాధ్యపడుతుందని, దానికి ఉగాది నాంది కానుందని తెలిపారు. ధనవంతులు పేదలకు చేయూతనివ్వడం..ఆర్థికంగా అండగా నిలవడమే పీ 4 విధానం ప్రధాన లక్ష్యమన్నారు. తరువాత వేద పండితులను, పంచాంగకర్తలకు కలెక్టర్, జేసీ, వీఎంఆర్డీఏ కమిషనర్ జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించి సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నృత్యగీతికలు, తెలుగు భాష ఔన్నత్యాన్ని, ఉగాది విశేషాలను వివరిస్తూ సాగిన కవి సమ్మేళనాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, పర్యాటక శాఖ ఆర్‌డీ జగదీశ్, పర్యాటక శాఖ అధికారి సుధాసాగర్, జూ క్యూరేటర్ మంగమ్మ, భీమిలి ఆర్డీఓ సంగీత్ మాథర్, డిప్యూటీ కలెక్టర్ సత్తిబాబు, జీవీఆర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా సంప్రదాయ ఉగాది ఉత్సవాలు



మురళీనగర్‌లో వైభవ వెంకటేశ్వర స్వామి



పంచాంగ పఠనం చేస్తున్న బ్రహ్మశ్రీ కె.సూర్యనారాయణమూర్తి



అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

డాబాగార్డెన్స్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దైవానుగ్రహంతో రాశులు అనుకూలిస్తాయని బ్రహ్మశ్రీ కె.సూర్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ సూర్యాబాగ్ లోని పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ పాప హోమ్ ప్రాంగణంలో భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా శాఖ సంయుక్తంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పాపాహోమ్ అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరూ భగవంతుడ్ని శరణాగతి భావంతో ప్రార్థించాలన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, బీవీపీ జాతీయ ప్రతినిధి రమేష్‌చంద్ జైన్, ప్రాంతీయ ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, ప్రతినిధులు సీహెచ్‌వీ సత్యనారాయణ, పి.భాస్కరరావు, జీఎస్‌వీ మాణిక్యాలరావు, పి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురళీనగర్: వాకర్స్ క్లబ్‌లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ క్లబ్ కళావేదిక వద్ద సాయంత్రం 7 గంటలకు పంచాంగ శ్రవణం చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కమిటీ సభ్యుల నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో కాలనీవాసులు, క్లబ్ సభ్యులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరై పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. మురళీనగర్ వైభవ వేంకటేశ్వర స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

జ్ఞానాపురం: ఉగాది పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం వద్ద రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆదివారం సెలవు దినంతో పాటు కొత్త సంవత్సరం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వెంకటేశ్వరమెట్ట బల్లిగిరి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు గొడపర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం వినిపించారు.



ఎర్నిమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు



సెంచూరియన్‌లో వేడుకలు ప్రారంభిస్తున్న కార్యదర్శి వాసిరెడ్డి శ్రీమంత్ తదితరులు

మహారాణిపేట: నగరంలో పేరొందిన ఐటీపీ సెంచూరియన్ క్లబ్‌లో సంస్థ కార్యదర్శి వాసిరెడ్డి శ్రీమంత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. పల్లెటూరి వాతావరణాన్ని తలపించేలా ప్రాంగణాన్ని రూపొందించారు. సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి విచ్చేశారు. ఉత్సవాల్లో భాగంగా పంచాంగ శ్రవణం, భక్తి గీతాలాపనలు, ఆంధ్ర జానపద నృత్యాలు, తప్పెటగుళ్ళ, కోలాటం, పులివేషాలు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే అనేక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. నిరాట స్కూల్ ఆఫ్ కూచిపూడి డాన్స్, చెంచులక్ష్మి నారాయణ కల్యాణ నృత్య ప్రదర్శన అద్భుతంగా నిర్వహించారు. వేడుకలు తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం విచ్చేశారు.

## కళారత్న.. ఉగాది పురస్కారాలు



చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న చలపతిరావు, సరస్వతి, రెడ్డి, విక్రమ గౌడ్, శిరేల సన్యాసిరావు (కుడి నుంచి ఎడమకు)

విజయవాడలో జరిగిన ఉగాది సంబరాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నగరానికి చెందిన పలువురు కళారత్న, ఇతర పురస్కారాలు అందుకున్నారు. పురస్కారాలు తీసుకున్న వారిలో సుంకరి చలపతిరావు, సరస్వతి విద్యార్థి, బీఎం రెడ్డి, విక్రమ గౌడ్, శిరేల సన్యాసిరావు, తదితరులు ఉన్నారు.

### కొద్దిరోజుల్లో డీక్యూఎంఎస్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌ను కొద్దిరోజుల్లో ప్రారంభించనున్నట్టు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతామన్నారు. దీనివల్ల కాలయాపన తగ్గి పారదర్శకత పెరుగుతుందన్నారు.

## నకిలీ బంగారంతో మోసగించిన ఇద్దరి అరెస్టు

సీతంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారంతో మోసగించిన చిప్పాడ ఈశ్వరరావు(38), వెంకట రాఘవేంద్ర సుబ్బారావు(45)లను అరెస్టు చేసినట్లు ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాజువాకకు చెందిన పొదిలాపు జగదీశ్వరరావు గోల్డ్ టెస్టింగ్ మిషన్ షాపు నిర్వహిస్తున్నాడు. బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు విడిపించలేక విక్రయించే వారి వద్ద తన డబ్బులు మదుపు పెట్టి బంగారం బ్యాంక్‌లో విడిపించి కమిషన్ తీసుకుంటాడు. ఈ క్రమంలో ఆయన వద్దకు విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన చిప్పాడ ఈశ్వరరావు, అగనంపూడి గొల్లవానిపాలెంకి చెందిన విజపురపు వెంకట రాఘవేంద్ర సుబ్బారావు లు తమ బంగారం సుమారు 2 కేజీలు ద్వారకానగర్‌లోని రూపిక్ బ్యాంక్‌లో కుదవ ఉందని, విడిపించలేకపోతున్నామని నమ్మబలికారు. ఆభరణాలు విడిపించి అమ్మి కమీషన్ తీసుకోవాలని కోరారు. దీంతో రూపిక్ బ్యాంక్‌కు రూ.68,51,300 చెల్లించి జగదీశ్వరరావు ఆభరణాలను విడిపించాడు. అయితే అవి నకిలీవిగా గ్రహించి ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ డి.వి.రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ జె.ధర్మేంద్ర, శ్రీనివాస్‌లు విచారణ చేపట్టారు.

## ఆకట్టుకున్న కవితా గోష్ఠి



కవితా గోష్ఠిలో పాల్గొన్న రచయితలు

సీతంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ సాహిత్య పరిషత్ నిర్వహణలో విశ్వావసు ఉగాది కవితా గోష్ఠి కార్యక్రమాన్ని ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. విశ్లేషకులు, రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ రంగస్థల నటుడు డాక్టర్ మీగడ రామలింగ స్వామి విచ్చేసి 'కుటుంబ వ్యవస్థ పరిరక్షణ' అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో కుటుంబ వ్యవస్థ సంబంధ బాంధవ్యాలు సన్నగిల్లిపోతున్నాయని, సుఖశాంతులతో మనగలగాలంటే కుటుంబ సంబంధాలు బలంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా విచ్చేసిన డాక్టర్ మోపిదేవి విజయగోపాల్, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, పిళ్లా రమణమూర్తి, గౌరీపతి శాస్త్రి, సీహెచ్ నిర్మల, భాగవతుల సత్యనారాయణమూర్తి, నిర్మల రాజు, డాక్టర్ ఎం.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నంలోని మినీ ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌ను శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఆదివారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుతో కలిసి పరిశీలించారు. తొలుత ఇద్దరూ కలిసి క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలపై చర్చించారు. గోపాలపట్నంలో బ్యాడ్మింటన్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల నిర్వహణ, సౌకర్యాలను పరిశీలించారు. వాటర్ స్పోర్ట్సును పునః ప్రారంభించి అక్కడ ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఒలింపియన్స్ వంటి అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులను అందించడమే కాకుండా ద్రోణాచార్య, అర్జున, ధ్యాన్‌చంద్ వంటి విశిష్ట అవార్డు గ్రహీతలను అందించిన ఘనత విశాఖ క్రీడారంగానికి ఉందన్నారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, డీఎస్‌ఏ కోచ్‌లు, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే గణబాబు తదితరులు

# పంచాయతీలకు ఊపిరి

... 5వ పేజీ తరువాయి

పంచాయతీలకు నేరుగా ఇవ్వకుండా ప్రభుత్వం మళ్లించింది. పంచాయతీలు విద్యుత్ బిల్లులు బకాయిల కింద కేంద్రం ఇచ్చే నిధులు జమచేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటికి ఏనాడూ లెక్కలు చెప్పలేదు. పంచాయతీల వారీగా విద్యుత్ బకాయిలు ఎంత? ఎంత చెల్లించారు? మిగిలిన బకాయి ఎంత అనేది గ్రామ సర్పంచులకు చెప్పకపోవడంతో టీడీపీ, వైసీపీ సర్పంచ్‌ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. చివరకు సాధారణ నిధులు ఖర్చుపై ఆంక్షలు విధించింది. దీంతో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టలేదు. సుమారు మూడేళ్ల పాటు పంచాయతీలకు రావాల్సిన నిధులు కోసం సర్పంచ్‌లు పోరాటంచేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధుల పంపిణీ కోసం పీఎంఎఫ్ఎస్ ఖాతాలకు కొత్తగా పంచాయతీల వారీగా ప్రారంభించాల్సి వచ్చింది. అదే సమయంలో సాధారణ నిధుల ఖర్చుపై వైసీపీ ఆంక్షలు కొనసాగించింది.

**ముఖ్యమంత్రి జోక్యంతో...**

ఇదిలావుండగా గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేకించి పంచాయతీల పాలనపై దృష్టిసారించారు. కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్రం విడుదల చేసే సాధారణ నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలకు జమచేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు 24 గంటల్లో బిల్లులు మంజూరవుతున్నాయి. సాధారణ నిధులతో చేపట్టే పనులకు రెండుమూడు రోజుల్లో బిల్లులు విడుదల కావడాన్ని సర్పంచులు స్వాగతిస్తున్నారు. మూడేళ్లకుపైగా అనేక ఇబ్బందులుపడ్డామని, ప్రస్తుతం గ్రామాల్లో పనులు చేపట్టడానికి అడ్డంకులు లేవని గంభీరం గ్రామ సర్పంచి వానపల్లి లక్ష్మి పేర్కొన్నారు. నిధుల విషయంలో గత ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేశామన్నారు. అయితే టైడ్ గ్రాంట్, అన్‌టైడ్ గ్రాంట్ నిధుల ఖర్చుపై ఉన్న ఆంక్షలు సడలించాలని కోరారు. పారిశుధ్యం, తాగునీటితో సమానంగా పనులు చేపట్టేందుకు నిధులు ఖర్చుచేసేలా మార్పులు చేయాలన్నారు. లేకపోతే గ్రామాల్లో పనులు చేపట్టడానికి అవరోధం ఎదురవుతుందన్నారు. కాగా గ్రామ పంచాయతీ తీర్మానాల మేరకు చేపట్టే పనులకు బిల్లుల మంజూరు చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సంరలో మరో విడత కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకావాల్సి ఉందన్నారు.

## దూర విద్యలో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

విమర్శలున్నాయి. విద్యార్థుల నుంచి భారీగా డబ్బు వసూలు చేసి మాస్ కాపీయింగ్ ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సబ్జెక్టు వారీగా ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొన్ని కాలేజీలపై ఫిర్యాదులున్నాయి. కేలండర్ ఇయర్ అడ్మిషన్స్‌లో భాగంగా వివిధ కోర్సుల్లో చేరిన 9వేల మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఏడో తేదీ వరకు సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. ఒక్కో కేంద్రానికి 40 నుంచి 80 మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు ఒక్కో కేంద్రానికి అబ్జర్వర్‌తోపాటు స్పెషల్ స్క్వాడ్‌ను నియమించారు. అబ్జర్వర్లను కేంద్రాల నిర్వాహకులు మేనేజ్ చేస్తుండడంతో తాజాగా వర్సిటీ అధికారులు స్పెషల్ స్క్వాడ్‌ను నియమించారు. అయితే, ఈ స్క్వాడ్ కళ్లను కప్పి కొన్నిచోట్ల మాస్ కాపీయింగ్ జరుగుతోందనే విమర్శలున్నాయి.

**సమయం మించినా..**

పరీక్షలు ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించాలి. కొన్ని చోట్ల ఆరుదాటిన తరువాత కూడా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. విజయనగరం జిల్లాలోని ఒక కేంద్రంలో సాయంత్రం పరీక్షలు నిర్వహించినట్టు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వీటిపై దూర విద్యా కేంద్రం అధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేస్తున్నారు.

**ఈ కేంద్రాలపై ఆరోపణలు..**

దూర విద్యా కేంద్రాలకు సంబంధించి గజపతినగరంలోని ఒక కాలేజీ, కొత్తవలసలోని రెండు కాలేజీలు, ఎస్.కోటలోని ఒక కాలేజీ, సబ్బవరం, తాడేపల్లిగూడెం, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాల్లోని కొన్ని పరీక్ష కేంద్రాలపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. ఏయూ దూర విద్యా కేంద్రం కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. దీంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల విద్యార్థులు భిన్నమైన కోర్సులు పూర్తిచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో లోపాలపై ఏయూ దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ మోహన్‌ను వివరణ కోరగా పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి కేంద్రంలో అబ్జర్వర్ తోపాటు స్పెషల్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. ఆరోపణలు వచ్చిన కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

## రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

రూ.440 కోట్లు పన్ను వసూలైంది. కొన్ని అసెస్‌మెంట్‌లకు సంబంధించిన యజమానులు పన్నులు చెల్లించకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయింది.

**లక్ష్యం దిశగా పయనం**

2024-25లో రూ.480 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యం మేరకు రెవెన్యూ విభాగం అధికారులు ప్రణాళికలు రచించి, అమలుచేశారు. దీంతో ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఒకరోజు గడువుండగా, ఆదివారం నాటికి రూ.478.63 కోట్లు వసూలైంది. అందులో రూ.412 కోట్లు పన్నులు, వీఎల్‌టీ ద్వారా రూ.66.63 కోట్లు వసూలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులు రాబట్టడంతోపాటు పెండింగ్ బకాయిలను వసూలుచేయడానికి రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని జోన్‌ల కమిషనర్లు, రెవెన్యూ అధికారులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. అసెస్‌మెంట్‌లను ఆస్తిపన్ను మాదిరిగా, ఖాళీస్థలాల అసెస్‌మెంట్‌లను వార్డు సచివాలయాల వారీగా మ్యాపింగ్ చేశారు. అడ్మిన్‌కార్యదర్శులు ప్రతి అసెస్‌మెంట్‌కు వెళ్లి పన్ను చెల్లించేలా యజమానులతో చర్చలు జరిపి, బకాయిలను రాబట్టారు. అంతకుముందు వార్డుల వారీగా అసెస్‌మెంట్‌లు ఉండడంతో టాక్స్ కలెక్టర్లు అన్ని అసెస్‌మెంట్‌ల యజమానులను కలిసి చర్చించేందుకు అవకాశం ఉండేది కాదు. తాజాగా వార్డు సచివాలయం పరిధిలో అన్ని అసెస్‌మెంట్‌లను మ్యాపింగ్ చేయడంతో పన్ను చెల్లించాల్సినవారికి డిమాండ్ నోటీసులు ఇవ్వడం, స్పందించనివారికి జప్తునోటీసులు ఇవ్వడం సులభమైంది. జీవీఎంసీ పరిధిలో సుమారు 20వేల మందికి జప్తునోటీసులు ఇవ్వడంతో వారంతా బకాయిలను క్లియర్ చేసుకోవడం పన్ను వసూలు పెరగడానికి దోహదపడింది.

**కలెక్టర్ చొరవతో...**

అలాగే జీవీఎంసీ కమిషనర్ పోస్టు గత రెండు నెలలుగా ఖాళీగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం కూడా పన్నులు వసూలు పెరుగుదలకు పరోక్షంగా కారణమైందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. కలెక్టర్ హోదాలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన పోర్టు, రైల్వేశాఖల ఉన్నతాధికారులతో నేరుగా ఆయన సమావేశమై ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలని కోరడంతో వారంతా కొంత కట్టేందుకు ముందుకువచ్చారని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోర్టు ట్రస్టు ఇటీవల రూ.12 కోట్లు ఆస్తిపన్ను చెల్లించగా, రైల్వేశాఖ నుంచి కూడా సోమవారం రూ.ఆరు కోట్లు వచ్చే అవకాశం ఉందని వివరిస్తున్నారు. ఏయూ వీసీతో కూడా జిల్లా కలెక్టరు హరేంధిరప్రసాద్ చర్చలు జరపడంతో రూ. ఏడు కోట్లు పన్ను చెల్లించారని చెబుతున్నారు. ఇది పన్నుల వసూళ్ల పెరుగుదలకు కారణమైందంటున్నారు. మరోవైపు రాష్ట్రప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ రాయితీ ప్రకటించడంతో చాలామంది ప్రైవేటు అసెస్‌మెంట్ దారులు బకాయిలను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. బకాయిలపై వడ్డీ మాఫీకి సోమవారం మాత్రమే గడువు ఉండడంతో మరింత మంది అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఆర్థిక సంవత్సరం చివరిరోజు మరో రూ.15 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఆస్తి పన్ను చెల్లింపునకు తుది గడువు నేడే

జ్ఞానాపురం: ఆస్తి, ఖాళీ స్థలాలపై పన్నును సోమవారంలోగా చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనకు చెల్లింపుదారులు సానుకూలంగా స్పందించారు. బకాయిదారుల సౌలభ్యం కోసం జ్ఞానాపురం, సూర్యాబాగ్‌లలోని సౌకర్య కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పనిచేస్తాయని జడ్జీలు రాము, మల్లయ్యనాయుడు తెలియజేశారు.

# నగరంలో ఐపీఎల్ జోష్


మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఏసీఏ ప్రతినిధులు


పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 18. 4 ఓవర్లకు 163 పరుగులు చేయగా, ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి, ఇక్కడ రెండో విజయాన్ని నమోదు చేసింది.


జాక్ ఫ్రేజర్, డుప్లెసిస్





కేఎల్ రాహుల్


ప్రేక్షకులతో నిండిన స్టేడియం


మహ్మద్ షమీ


ఢిల్లీ జట్టు కెప్టెన్ అక్షర పటేల్


వికెట్ తీసిన ఆనందంలో ఢిల్లీ జట్టు ఆటగాళ్లు


వికెట్ తీసిన ఆనందంలో మిచెల్ స్టార్క్


క్లాసెన్ బ్యాటింగ్


ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో స్టార్క్


క్యాచ్ పడుతున్న జాక్ ఫ్రేజర్


ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, హోం మంత్రి అనిత

# టీడీపీ కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు


పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇతర నాయకులు

మహారాణిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు, పండితులు నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి విశాఖ ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిధిగా విచ్చేశారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. తెలుగు ప్రజలు అత్యంత ప్రీతిపాత్రంగా జరుపుకొనే ఉగాది పండగ సందర్భంగా ఈ సంవ త్సరం అంతా మంచి జరగాలని కోరుకుంటారన్నారు. ప్రజలంతా సుఖశాం తులతో ఉండాలని కోరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ మాట్లడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఉగాది నుంచి ప్రజలు సుఖ శాంతులతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, రాజమండ్రి నారాయణ, తమ్మిన విజయకుమార్, వానపల్లి ఫణి గాయత్రీ కుమారి, వెల్లంకి భరత్, తోట రత్నం, గనగళ సత్యవతి. సుజాత, రమాదేవి, విల్లూరి తిరుమలా దేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో పంచాంగ శ్రవణం

ఆరిలోవ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాదిని పురష్కరించుకొని ఆరిలోవ ప్రాంతంలోని పలు ఆలయాల్లో ఆదివారం వేద పండితులు పంచాంగ శ్రవణం గావించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం ఫలితాలను గురించి గోచార ఫలితాల గురించి వివరించారు. చినగదిలి లోగల నార్త్ షిర్డి సాయిబాబా ఆలయంలో ఆలయం వేద పండితులు శ్రీకాంత్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు.

## సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా),మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు(నలుపు) 28, బెండకాయలు 34, పచ్చిమిర్చి30, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 18, బంగాళ దుంపలు 15, అరటికాయ(పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వె ల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండుసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట)3, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

**కోడిగుడ్లు (నెక్)** (వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 460 |
| విజయనగరం | 464 |
| శ్రీకాకుళం | 464 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 118 |
| లైవ్ ధర | 138 |
| విత్ స్కిన్ | 246 |
| స్కిన్‌లెస్ | 256 |

## వెంకన్న ఆలయంలో ఉగాది ప్రత్యేక పూజలు


అలంకరణలో శ్రీవారు

ఎంవీపీ కాలనీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆరో సెక్టరులో కొలువైయున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాన్ని, స్వామి వారిని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా అందించారు. అలాగే ఉడా హెల్త్ ఎరీనాలో వాకర్స్ అందరూ ఉగాది సంబరాలు నిర్వహించారు. ఉగాది పచ్చడితో పాటు అందరికీ మిఠాయిలు పంచారు.

# గాఢాంధకారంలో హెల్త్‌సిటీ

- వీధి లైట్లు వెలగక రాకపోకలకు ఇబ్బందులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


వీధి లైట్లు వెలగక చీకటిమయంగా ఉన్న హెల్త్ సిటీ పరిసరాలు

ఆరిలోవ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ హెల్త్ సిటీరోడ్డులో వీధిలైట్లు వెలగక ఈ ప్రాంతమంతా గాడాంధకారంగా ఉన్నది. స్మార్ట్‌సిటీలో భాగంగా రూపొందిన ఈ ప్రాంతం నగరంలో ఓ ముఖ్య ప్రాంతం. ఈ రోడ్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటిమయంగా ఉంటోంది. రాత్రి సమయంలో ఈ రోడ్లలో ప్రయాణం చేసేందుకు ఇబ్బందిగా మారడంతో హెల్త్ సిటీలో గల ఆస్పత్రికి వచ్చే రోగులు, బంధువులు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగా వెళ్లేందుకు పాదచారులు భయపడుతున్నారు. సాయంత్రం అయి కాస్త చీకటి అయితే చాలు ఈ ప్రాంతంలో గాఢాంధకారంగా మారిపోతోంది. రెయిన్ బో ఆస్పత్రి నుంచి పినాకిల్ ఆస్పత్రి, హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి వెనుక రోడ్డు నుంచి అధిక సంఖ్యలో వాహన చోదుకులు శ్రీకాంత్‌నగర్‌కు వెళ్లేవారు ఈ మార్గంలో వెళ్లవలసి ఉంటుంది. హెల్త్ సిటీలోని పలు ఆస్పత్రుల్లో పని చేసే సిబ్బంది కూడా అధిక సంఖ్యలో శ్రీకాంత్‌నగర్‌లో నివాసాలు ఉంటున్నారు. వారంతా రాత్రి సమయంలో ఇంటికి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.అయితే ఆ ప్రాంతమంతా చీకటిమయంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. కుక్కలు కూడా అధిక సంఖ్యలో ఉండడంతో చీకటితో రాకపోకలు సాగించే ధైర్యం చేయలేకపోతున్నారు. ఈ సమస్యను జీవీఎంసీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందిం చి హెల్త్‌సిటీలో వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణ ఉడుపురాట


రాట ఉత్సవంలో పాల్గొన్న స్థానికులు

వెంకోజీపాలెం, మార్చి(ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజిపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ మేర కు సీతారాముల కల్యాణ రాటను ఆలయ ప్రాంగణంలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా గ్రామస్థులు వేశా రు. తొలుత కల్యాణ దంపతులు సంఘం అధ్యక్షు లు దంపతులు కర్రి వెంకట సూరి అప్పారావు, ఆలయ ప్రధానార్చకులు రంపా రామ్మోహన్ శర్మ దంపతులు ఉడుపురాటకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేతికి కంకణాలను కట్టుకున్నారు. ఈ సందర్భంగా కల్యాణానికి వినియోగించే హనుమత్ సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలతోపాటు ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న సాయి ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు చేయించారు. పాలు, పంచామృతాలతో స్నానమాచరించి అనంతరం ఈ ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో కొలువు ఉంచారు.

పరిసర ప్రాంతాల మహిళలు, యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ విగ్రహాలకు ఇత్తడి, స్టీల్ బిందెలతో నీటిని పోసారు. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవ విగ్రహాలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్టు అధ్యక్షులు కేవీఎస్ అప్పారావు తెలిపారు. అలాగే ఏప్రిల్ 6న శ్రీరామనవమి ఉత్సవాలను అంగరంగ వైభవంగా, భద్రాది రామచంద్రునికి నిర్వహించే ముహర్తానికి ఉదయం 11 గంటల 52 నిముషాలకు పుష్యమి నక్షత్ర మిధున లగ్నమందు జరుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, జనసేన నాయకులు పీల వెంకట పరదేశినాయుడు, సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు బొడ్డేటి రామకృష్ణ, కర్రి రవి, యల్లపు శ్రీను, కర్రి రఘు, రాజగిరి సతీష్, పెంటకోట నాగేశ్వరరావు, కాళ్ల రాజేష్, ఆడారి శివప్రకాష్, గ్రామ పెద్దలు భీమరశెట్టి విశ్వనాథం, పొలమరశెట్టి శంకరరావు, గ్రామస్థులు, మాజీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్త వెంకోజిపాలెంలోని శ్రీసీతారాముల ఆలయం వద్ద గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో, ఇసుకతోట రామాలయంలో శ్రీసీతారామ సేవా మండలి, ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకటేశ్వరాలయంలోనూ కల్యాణ రాటను ఆయా ఆలయ కమిటీ సభ్యులు వేశారు.

## చలివేంద్రం ఏర్పాటు

ఎంవీపీ కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ అయిదో సెక్టరులో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పదిహేనేళ్లుగా క్రమం తప్పకుండా వేసవి రెండు నెలలూ చలివేంద్రం నిర్వహిస్తున్న కాలనీ వాసులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వెలగపూడి ప్రతాప్ రుద్ర, తెలుగుదేశం నాయకులు కాళ్ల శంకర్, అప్పారావు, సత్యనారాయణ, రామారావు, ఎల్.సత్యనారాయణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఆరిలోవ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డు పరిధి పాత డెయిరీ ఫారం వద్ద గల ఆదర్శనగర్‌లో వెలిసిన షిర్డీ సాయిబాబా ఆలయం 27వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని నూతన వస్త్రాలు, గులాబీలతో అలంకరించారు. అదిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి సాయి సత్యవ్రతాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ స్వామి ప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామి వారి పల్లకి చావడీ ఉత్సవం నిర్వహించారు, ఆలయం అధ్యక్షుడు బండి గోవర్దన్ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# యాదవుల సంక్షేమమే లక్ష్యం

యాదవ సంఘం సభ్యుల ఆత్మీయ కలయికలో వక్తలు


సమావేశంలో పాల్గొన్న యాదవ సంక్షేమ సంఘం నాయకులు

మద్దిలపాలెం. మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : యాదవుల సంక్షేమమే విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం లక్ష్యమని సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు చెప్పారు. శివాజీపార్క్ రోడ్డు సవేరా ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన యాదవ సంఘం సభ్యుల ఆత్మీయ కలయికలో ఆయన మాట్లాడారు. ఎండాడ ప్రాంతలో యాదవ భవనం నిర్మాణానికి కేటాయించిన స్థలంలో భవనం నిర్మించడానికి యాదవ పెద్దలతో చర్చిస్తామన్నారు. యాదవ భవనం అందుబాటులోకి వస్తే యాదవుల కార్యక్రమాలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. అలాగే యాదవులు ఆర్థిక, రాజకీయంగా నిలబడడానికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ పరంగా యాదవులకు అందాల్సిన ప్రయోజనాలను పొందడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘంఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, నాయకులు అప్పలకొండ, యడ్ల వేణుగోపాల్, డొక్కర శ్రీను,పిన్నింటి ఆదిమూర్తి, పక్కుతి సన్యాసిరావు, పల్లా రమేష్, ఒమ్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే తనయుడు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న వెలగపూడి ప్రతాప్ తదితరులు

మద్దిలపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు మంగాపురంకాలనీ తారా మసీదులో ఆదివారం నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ తనయుడు ప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో అల్లాకు పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉపవాసం విరమించిన ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందును తీసుకున్నారు. ఆయనతో పాటు ఇఫ్తార్ విందులో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పారావు, జనసేన నాయకులు వెంకటప్రసాద్, దేవర రఘు తదితరులు పాల్గొన్నారు.

## కోదండరామ కల్యాణ మహోత్సవం ప్రారంభం


పందిరిరాట ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

పెదవాల్తేరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఏయూ అవుట్ గేటు వద్ద కల్యాణ్ నగరంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో కోదండరామ కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పందిర రాట మహోత్సం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురష్కరించుకుని కల్యాణ మహోత్సవం ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్నట్టు కోదండరామస్వామి ఆలయ అధ్యక్షులు వన్నె రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాముల దివ్య తిరుకల్యాణం, పట్టాభిషేకం మహోత్సవం ఆహ్వానపత్రికను ఆయన విడుదల చేశారు. సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఈ 11 రోజుల ఉత్సవాన్ని భక్తులంతా పాల్గొని స్వామి కల్యాణాన్ని తిలకించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి రాజు, కోటేశ్వరరావు,గ్రామ పెద్దలు బి.తిరుమల రావు, తాతారావు, అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పన్నుల చెల్లింపులపై 50 శాతం వడ్డీ రాయితీకి నేటితో గడువు పూర్తి

వెంకోజీపాలెం, మార్చి (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగర పరిధిలోని గృహ యజమానులు/ ఆస్తి పన్ను చెల్లింపుదారులు జీవీఎంసీకు చెల్లించవలసిన ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్నుల (వీఎల్టీ) బకాయిలను ఏక మొత్తంగా ఒకేసారి చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన పన్నులపై 50 శాతం వడ్డీ మినహాయింపును పొందేందుకు సోమవారం మార్చి 31 ఆఖరు తేదీ అని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరింధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గృహ యజమానులు/ ఆస్తి, ఖాళీ జాగా పన్నుదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. నగర ప్రజలు సౌకర్యార్థం ప్రతీ వార్డు సచివాలయ పరిధిలోని ప్రతీ గృహ ఇంటి యజమానిని వారి గృహం వద్దకు వార్డు సచివాలయ కార్యదర్శి వచ్చినప్పుడు/ సంప్రదించినప్పుడు ఆస్తిపన్ను బకాయిలను డెబిట్/ క్రెడిట్ కార్డు లేదా యూపీఐ ద్వారా గాని చెల్లించ వచ్చన్నారు. కాబట్టి ఆస్తి పన్ను చెల్లింపుదారులు తమ పన్నుల బకాయిలను సోమవారం ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, అలాగే అన్ని జోనల్ కార్యాలయాల సౌకర్యం కేంద్రాల్లో చెల్లించి విశాఖ నగరాభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ కోరారు.

## బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా విశ్వనాథం



వెంకోజీపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా 15వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం మాజీ అధ్యక్షులు భీమరశెట్టి విశ్వనాథంను నియమిస్తూ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ నగరంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, పార్టీ నేతు తనపై ఉంచిన నమ్మకాని నిలబెట్టుకుంటానని అన్నారు.

## శారదా పీఠంపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్


డెప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు వినతిపత్రం అందిస్తున్న బీవీ రామ్

ఎంవీపీ కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శారదా పీఠం విషయంలో పెందుర్తి తహశీల్దార్ మరో మూడు వారాల గడువుకు అంగీకరించడం సరైన చర్య కాదని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ విమర్శించారు. శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజుకు ఆయన ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో కలసి వినతిపత్రం అందించారు. శారదా పీఠంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో కూడా అధికారులు అలసత్వంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పెందుర్తిలోని శారదా పీఠం భూములపై తాము ఇంతకుముందే ఫిర్యాదులు చేశామని, ఆక్రమణలు కూడా నిజమేనని నిర్ధారణ అయిన తర్వాత కూడా ఇంకా గడువు కోరడం, అధికారులు కూడా అంగీకరించడం ఏమిటని ప్రశ్నించారు. శాసనసభలో భారతీయ జనతా పార్టీ ఫ్లోరల్ లీడర్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకువెళ్లినట్లు రామ్ తెలిపారు.

## దేవుడు ఎద్దుకు గడ్డి దానం

వెంకోజీపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘానికి చెందిన ఒమ్మి జగప్ప సేవా గరిడి దేవుడు ఎద్దుకు మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు రూ.10 వేలతో గడ్డిని దానం చేశారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు అప్పలరాజును ఆదివారం ఘనంగా సత్కరించారు. గరిడీ సేవకులతో పాటు రాధాకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, శ్రీ సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలి రాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, జనసేన నేతలు వెంకట పరదేశి నాయుడు పాల్గొన్నారు.